క్లుప్తంగా

నేడు టెన్నిస్ శిక్షణ శిబిరం ప్రారంభం

ప్రకాశం నగర్ : ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాల పూర్వ విద్యార్థుల సంఘం ఆధ్వర్యంలో మంగళవారం నుంచి స్థానిక ఆర్ట్స్ కళాశాల మైదానంలో ఉచిత టెన్నిస్ శిక్షణ శిబిరాన్ని ప్రారంభిస్తున్నట్టు సంఘం అధ్యక్షుడు ముళ్ల మాధవ్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం ఆరు గంటలకు ఆర్ట్స్ కళాశాల మైదానంలో ఈ శిక్షణ శిబిరం ప్రాంభోత్సవ కార్యక్రమానికి కళాశాల ప్రిన్సిపాల్ ఆర్.కె.రామచంద్ర ముఖ్య అతిథిగా హాజరవుతారని తెలిపారు.

ప్రతి ఓటూ కీలకం



పోస్టల్ బ్యాలెట్ ప్రక్రియను పరిశీలిస్తున్న సుబ్రహ్మణ్యం

కంబాలచెరువు (రాజమహేంద్రవరం): రాజ్యాంగం కల్పించిన ఓటు హక్కు వినియోగించుకోవడం మన సామాజిక బాధ్యతని సార్వత్రిక ఎన్నికల సాధారణ పరిశీలకులు కె.సుబ్రహ్మణ్యం పేర్కొన్నారు. స్థానిక ఆర్ట్స్ కళాశాల ఆవరణలో పీవో, ఏపీవో రెండో శిక్షణ కార్యక్రమంలో భాగంగా పోస్టల్ బ్యాలెట్ ప్రక్రియను, ఆర్వో కె.దినేష్‌కుమార్, సహాయ కలెక్టర్ సి.యశ్వంత్ కుమార్‌తో కలిసి సోమవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ ఓటు హక్కు ఉన్న ప్రతి ఒక్కరూ పోలింగ్ కేంద్రానికి వచ్చి ఓటు వేసేలా స్వీప్ కార్యకలాపాలను నిర్వహిస్తున్నామన్నారు. పోలింగ్ రోజున ఓటు వేసేందుకు వచ్చే వారికి ఓటు హక్కును కల్పిస్తామన్నారు. పీవో బుక్‌లో పేర్కొన్న విధంగా ఎన్నికల విధులు నిర్వహించే క్రమంలో నిబద్ధతతో ఉండాలన్నారు. మునిసిపల్ కమిషనర్, రాజమండ్రి సిటీ అసెంబ్లీ నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి కె.దినేష్ కుమార్ మాట్లాడుతూ శిక్షణకు హాజరైన ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా ఓటు హక్కును వినియోగించుకునేలా చర్యలు తీసుకోవాలన్నారు.

సెబ్ అధికారుల దాడులు

రాజమహేంద్రవరం రూరల్: జిల్లా స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్‌బ్యూరో ఆఫీసర్ పిట్టా సోమశేఖర్ ఆదేశాల మేరకు సెబ్ రాజమహేంద్రవరం నార్త్‌స్టేషన్ పరిధిలో గత కొద్దిరోజులుగా నిర్వహిస్తున్న దాడులలో తొమ్మిది మందిని అరెస్టు చేసినట్లు ఇన్‌స్పెక్టర్ డా.ఎన్.నెక్సన్ ఒక ప్రకటనలో తెలిపారు. వారి నుంచి 73 బీర్లు, 58 మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నామన్నారు. ఈ దాడులలో ఇన్‌స్పెక్టర్ డా.ఎన్.నెక్సన్, సబ్‌ఇన్‌స్పెక్టర్ ఎంఎస్ఎన్ శాస్త్రి, సిబ్బంది పాల్గొన్నారు.

లారీ ఢీకొని ఫొటో గ్రాఫర్ మృతి

రాజమహేంద్రవరం రూరల్: లారీ ఢీకొని రాజమహేంద్రవరం శేషయ్యమెట్టకు చెందిన ఫొటో గ్రాఫర్ దారా రాజేష్(25) మృతి చెందిన సంఘటన సోమవారం సాయంత్రం చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. దారా రాజేష్ రాజానగరం నుంచి రాజమహేంద్రవరం వైపు పల్సర్‌బైక్‌పై వస్తుండగా సోమవారం సాయంత్రం 5.30 గంటల సమయంలో లారీ అతివేగంగా వచ్చి ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో బైక్ ఒక పక్కకి, లారీ వెనుక చక్రం కింద రాజేష్ పడడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. రాజేష్ తండ్రి దారా రాజారావు ఫిర్యాదు మేరకు బొమ్మూరు ఎస్సై బి.శ్రీను కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. వాచ్‌మెన్‌గా పనిచేస్తున్న తనకు ఫొటో గ్రాఫర్ వృత్తి చేస్తూ కుటుంబానికి అండగా నిలిచిన కుమారుడు రాజేష్ రోడ్డు ప్రమాదంలో మృత్యువాత పడడంతో జీర్ణించుకోలేకపోతున్నానంటూ రాజారావు, కుటుంబ సభ్యులు కన్నీరు మున్నీరవుతున్నారు.

ఎన్నికల నిర్వహణలో పీఓ, ఏపీఓల పాత్రే కీలకం

రాజానగరం: ఎన్నికలను ప్రశాంతంగా, సక్రమంగా నిర్వహించుటలో పీఓలు, ఏపీఓల పాత్ర ఎంతో కీలకమైనదని రిటర్నింగ్ అధికారి ఎ.చైత్రవర్షిణి అన్నారు. మండలంలోని పాలచర్ల బీవీసీ ఇంజినీరింగ్ కళాశాలలో పీఓ, ఏపీఓలకు సోమవారం శిక్షణనిచ్చారు. రాజమహేంద్రవరం పార్లమెంటు, నాలుగు అసెంబ్లీ నియోజకవర్గాల సాధారణ పరిశీలకులు కె.సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ ఎన్నికల నిర్వహణలో సిబ్బంది పాత్ర కీలకమన్నారు. ఒకటికి రెండుసార్లు పునశ్చరణ చేసుకుని, తొందరపాటు లేకుండా విధులను నిర్వర్తించాలని సూచించారు. రిటర్నింగ్ అధికారి మాట్లాడుతూ మొదటి రోజు 260 మంది ఉద్యోగులు పోస్టల్ బ్యాలెట్ పోలింగ్ అవకాశాన్ని వినియోగించుకున్నారన్నారు. జిల్లాలోని ఏడు నియోజకవర్గాలలో రాజానగరంలో 40 మంది, అనపర్తిలో 17 మంది, రాజమహేంద్రవరం సిటీలో 95 మంది, రూరల్‌లో 75 మంది, కొవ్వూరులో 27 మంది, నిడదవోలులో 44 మంది, గోపాలపురంలో 28 మంది పోస్టల్ బ్యాలెట్ ఓటర్లు ఉన్నారన్నారు. 98 మంది వృద్ధులు హోమ్ ఓటింగ్‌ని వినియోగించుకున్నారన్నారు.

శీతలపానీయాల అందజేత

మధురపూడి: కోరుకొండలో ఉపాధి పనులు చేస్తున్న కూలీలకు సోమవారం శీతలపానీయాలు అందజేశారు. మండుటెండలో కూలీలకు ఉపశమనం కోసం వైఎస్సార్ సీపీ నాయకులు అందించారు.

నయనానందకరంగా గ్లో గార్డెన్

- అద్భుతమైన టెక్నాలజీ, లైటింగ్‌తో ఏర్పాటు
- రూ.4.4 కోట్లతో పార్క్ నిర్మాణం
- దేశంలో మూడవది



గ్లో గార్డెన్‌లో ఆకట్టుకుంటున్న లైటింగ్

రాజమహేంద్రవరం సిటీ: అడుగుపెడితే చాలు అద్భుతమైన లోకంలో విహరించినట్లుండే వాతావరణం, సినిమాల్లో మాత్రమే చూసే అందమైన విద్యుత్ వెలుగులు రాజమహేంద్రవరం నగరంలో సాక్షాత్కరించాయి. ఒక్కసారి పార్కులో అడుగుపెడితే చాలు ఆనందం మన సొంతం అనే అనుభూతి కలుగుతుంది. ఎంతో మనోరంజకంగా నయనానందకరంగా తయారు చేశారు గ్లో గార్డెన్ పార్కు. రాజమహేంద్రవరం కార్పొరేషన్ ఆధ్వర్యంలో లాలా చెరువు సమీపంలోని 50వ డివిజన్ గాం.దీపురం-4 మున్సిపల్ పార్కులో ఏర్పాటు చేసిన గ్లో గార్డెన్ చిన్నా పెద్దలందరినీ ఆకట్టుకుంటోంది. ఈ పార్కులో అత్యాధునిక టెక్నాలజీ, మిరుమిట్లు గొలిపే లైటింగ్‌తో రూ.4.4 కోట్లు ఖర్చు చేసి నిర్మించారు. ఇలాంటి పార్కులు గుజరాత్ రాష్ట్రంలో ఒకటి, తెలంగాణలో రెండోది, రాజమహేంద్రవరంలో మూడోది ఏర్పాటు చేశారు.

అంతా విద్యుత్ లైట్లే..

నగరంలో రాత్రి ఆరయితే చాలు అద్భుతమైన అందాల హరివిల్లు పార్కులో కనిపిస్తుంది. రాత్రి 6.30 గంటల నుంచి 10 గంటల వరకూ ప్రజలు సందర్శించవచ్చు. పెద్దలకు రూ.30, పిల్లలకు రూ.20 ప్రవేశ టిక్కెట్‌గా నిర్ణయించారు. వివిధ ఆకారాల్లో ఈ గార్డెన్‌లో పలు రకాల జంతువుల ఆకారాల్లో విద్యుత్ దీపాలను ఏర్పాటు చేశారు. జింకలు, ఎలుగుబంట్లు, జిరాఫీలు, జీబ్రాలు, హంసలు, ఫ్లెమింగోలు ఎంతో ఆకట్టుకుంటున్నాయి. సందర్శకులు కూర్చునేందుకు ప్రత్యేక లైటింగ్‌తో సిట్టింగ్ ఏర్పాటు చేశారు. వెదురు పొదలు, చెర్రీ ట్రీస్, ఫామ్ ట్రీస్ అద్భుతంగా ఉన్నాయి. చిన్నారులు ఆడుకునేందుకు సంగీతం, లైటింగ్‌తో వచ్చే పియానో విశేషంగా ఆకట్టుకుంటుంది. దీంతో పాటు 32 డిస్క్ ఏర్పాటు చేశారు. దీన్ని ప్రత్యేకత ఏమిటంటే సందర్శకులు అడుగు తీసి అడుగు వేసే సమయంలో లైటింగ్ వస్తూ పోతూ ఉంటుంది. ఇది మరింత సరదానిస్తోంది. దీపాలతో వెలిగేలా పెద్ద చెట్లు, గ్రాస్ (గడ్డి) ఏర్పాటు ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది.



కనువిందు చేస్తున్న జింకలబొమ్మ



లైటింగ్‌తో ఏర్పాటు చేసిన గ్రాస్



లైటింగ్‌తో ఏర్పాటు చేసిన జీబ్రా

పురందేశ్వరీ.. ఆరోపణలు నిరూపిస్తారా ?

- బహిరంగ చర్చకు నేను సిద్ధం.. మీరు సిద్ధమా?
- కమీషన్ల ఆరోపణపై ఎంపీ భరత్ సవాల్



ఎంపీ భరత్‌రామ్

రాజమహేంద్రవరం సిటీ: బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు దగ్గుబాటి పురందేశ్వరి నోటికొచ్చినట్టు నిరాధార ఆరోపణలు చేస్తే సహించేది లేదని, నేను 25 శాతం కమీషన్ ఎక్కడైనా తీసుకున్నట్టు నిరూపించాలని ఎంపీ, వైఎస్సార్ సీపీ సిటీ ఎమ్మెల్యే అభ్యర్థి మార్గాని భరత్ రామ్ డిమాండ్ చేశారు. సోమవారం ఆయన మాట్లాడుతూ ఎవరో రాసిచ్చినవి చదవడం కాదని, అవి ఎంత వరకూ వాస్తవమో నగరంలో విచారణ చేసుకోకుండా ఇష్టం వచ్చినట్టు విమర్శలు చేస్తే సహించేది లేదన్నారు. అభివృద్ధి పనులు ఒకవైపు జరగలేదని చెప్పేదీ మీ కూటమి నాయకులేనని, మరో వైపు అభివృద్ధి పనుల్లో 25 శాతం కమీషన్లు తీసుకున్నానని నిబద్ధతలేని ఆరోపణలు చేస్తున్నారన్నారు. కమీషన్లు తీసుకునే సంస్కృతి, కక్కుర్తి మీ కూటమిలో టీడీపీకే ఎక్కువ అలవాటని ఆరోపించారు. టీడీపీ నేతలు ఆదిరెడ్డి కుటుంబానికి కమీషన్లే ఊపిరి అని, కమీషన్లే ఆహారం బతుకుతున్నారన్నారు. రాజకీయాలు నడిపేది, అధికారం కోసం వెంపర్లాడేది ఆ కమీషన్ల కోసమే అన్నారు. నగరాన్ని అభివృద్ధి చేయాలనే చిత్తశుద్ధితో నిస్వార్థంగా కృషి చేస్తున్న నాపై ఏ ఆధారంతో ఆరోపణలు చేశారో స్పష్టత ఇవ్వాలని ఎంపీ భరత్ డిమాండ్ చేశారు. అధికార దాహంతోనో, మీ మరిది కళ్లలో ఆనందం కోసం పోటీ చేస్తున్నారు. నిరాధార ఆరోపణలు చేస్తే దానికి తగిన మూల్యం తప్పక చెల్లించవలసి వస్తుందని ఎంపీ భరత్‌రామ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. మోరంపూడి ఫ్లై ఓవర్ బ్రిడ్జి, కంబాల చెరువు పార్కు అభివృద్ధి, రైల్వే స్టేషను, విమానాశ్రయం, ఈఎస్ఐ ఆసుపత్రి భవనం, ప్రభుత్వ మెడికల్ కళాశాల ఇవన్నీ అభివృద్ధి పనులుగా కనిపించడం లేదా అంటూ మండి పడ్డారు. నిధులన్నీ మా కేంద్రమే ఇచ్చిందని పదేపదే గొప్పలు చెప్పుకోవడం మీ అజ్ఞానం, అహంకారం తప్పిస్తే మరేమీ లేదన్నారు. మీరు ఎంపీగా విశాఖకు చేసిన అభివృద్ధి, నేను ఎంపీగా చేసిన అభివృద్ధికీ చాలెంజ్ చేస్తా బహిరంగ చర్చకు సిద్ధం కావాలని పురందేశ్వరికి ఎంపీ భరత్‌రామ్ సవాల్ విసిరారు.

సెబ్ విస్తృత దాడులు



స్వాధీనం చేసుకున్న సారా, డ్రమ్ములు, అరెస్టు చేసిన నిందితులతో సెబ్ సిబ్బంది

రాజమహేంద్రవరం రూరల్: జిల్లా స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో ఆఫీసర్ పిట్టా సోమశేఖర్ ఆదేశాల మేరకు సోమవారం సెబ్ రాజమహేంద్రవరం సౌత్‌స్టేషన్ ఇన్‌స్పెక్టర్ పి.హనుశ్రీ సిబ్బందితో కలిసి విస్తృతదాడులు నిర్వహించారు. రాజానగరం మండలం శ్రీరామపురం గ్రామానికి చెందిన ఈరి ధర్మరాజును అదుపులోకి తీసుకుని, 30లీటర్ల సారాను స్వాధీనం చేసుకుని, 600లీటర్ల బెల్లపుఊటను ధ్వంసం చేశారు. చక్రద్వారబంధం గ్రామానికి చెందిన గుబ్బల దుర్గారావును అరెస్టు చేసి అతని నుంచి 2.52 లీటర్ల డ్యూటీపెయిడ్ లిక్కర్‌ను స్వాధీనం చేసుకున్నారు. ఈ దాడుల్లో ఇన్‌స్పెక్టర్ పి.హనుశ్రీ, సబ్‌ఇన్‌స్పెక్టర్లు వై.దుర్గాప్రసాద్, బి.శ్రీనివాస్, సిబ్బంది పాల్గొన్నారు.

జగన్ పాలనలో పథకాల పంట



వేమగిరిలో మంత్రి వేణు ప్రచారం

- ఎన్నికల సంగ్రామానికి సిద్ధం కావాలి
- వేమగిరి ఎన్నికల ప్రచారంలో మంత్రి వేణు



మంత్రి వేణుతో కలిసి ప్రచారంలో పాల్గొన్న వేమగిరి గ్రామస్తులు

కడియం: పచ్చని పంటల్లాంటి పథకాలు అమలు చేసిన ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డికి మాత్రమే దక్కిందని మంత్రి, వైఎస్సార్ సీపీ రాజమహేంద్రవరం రూరల్ ఎమ్మెల్యే అభ్యర్థి చెల్లుబోయిన వేణు గోపాలకృష్ణ అన్నారు. వేమగిరి గ్రామంలోని వేమగిరి తోట, సుబ్రహ్మణ్యం స్వామి గుడి సెంటర్ తదితర ప్రాంతాల్లో సోమవారం రాత్రి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి వేణు మాట్లాడుతూ వారం రోజుల్లో ఏపీలో కురుక్షేత్ర మహా సంగ్రామం జరగబోతోందని, వైఎస్సార్ సీపీకి ఓటేసి గెలిపించాలని కోరారు. పార్టీ అధికారంలోకి వస్తేనే పథకాలు కొనసాగుతాయన్నారు. చంద్రబాబుకు ఓటువేయడం అంటే కరువును స్వాగతించడమేనని అన్నారు. ఈ ఎన్నికలు కేవలం ఎంపీలు, ఎమ్మెల్యేలను ఎన్నుకోవడం మాత్రమే కాదని, ఐదేళ్ల మీ భవిష్యత్తును నిర్ణయించే ఎన్నికలు అని తెలిపారు. పొరపాటున చంద్రబాబుకు ఓటు వేస్తే.. పథకాలన్నీ ముగిసిపోయినట్లేనన్నారు. అందరూ ఈ నెల 13వ తేదీన జరిగే ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుకు ఓట్లు వేసి తనను ఎమ్మెల్యేగా గెలుపించి జగనన్నను ముఖ్యమంత్రిని చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు కట్టా జమీందార్, నరాల గణపతి, గుబ్బల నాగార్జున, వెలుగుబంటి అచ్చుతరామ్, తాడాల చక్రవర్తి, నరాల శ్రీను, అల్లంపల్లి శ్రీను, బైవరపు నాగేశ్వరరావు, పితాని శ్రీను, లావేటి రమేష్, బిల్లకుర్తి ముత్యాలరావు, చిలుకూరి రామకృష్ణ పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీలోకి భారీగా చేరికలు



వైఎస్సార్ సీపీలో చేరిన వారితో మంత్రి చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణ ,ఎంపీ అభ్యర్థి గూడూరి శ్రీనివాస్

కండువా వేసి ఆహ్వానించిన మంత్రి వేణు, ఎంపీ అభ్యర్థి గూడూరి

ధవళేశ్వరం: స్థానిక ఎర్రకొండ ప్రాంతానికి చెందిన టీడీపీ, జనసేన పార్టీల నాయకులు పలువురు వైఎస్సార్ సీపీ జిల్లా మైనారిటీ సెల్ ఉపాధ్యక్షుడు ఎండీ హమీద్‌బాషా ఆధ్వర్యంలో వైఎస్సార్ సీపీలో చేరారు. వీరికి మంత్రి, వైఎస్సార్ సీపీ రాజమహేంద్రవరం రూరల్ ఎమ్మెల్యే అభ్యర్థి చెల్లుబోయిన శ్రీనివాస వేణు గోపాలకృష్ణ, ఎంపీ అభ్యర్థి గూడూరి శ్రీనివాస్ కండువాలు వేసి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. టీడీపీ, జనసేనకు చెందిన కరణం శివ, కర్ణం వరహాలరావు, గంజి అప్పలకొండ, దుబాసి దొరబాబు, ఎర్రబోలు సత్తిబాబు, సేనాపతి అప్పలనాయుడు, నరిసేటు శ్రీను, కరణం నాని, అప్పారావు, తేడా అర్జున్, దుబాసి బాబురావు, దుబాసి వెంకటేష్, సుమారు 250 మంది పార్టీలో చేరారు. ఇదే విధంగా వెలమ, తూర్పు కాపు సంఘానికి చెందిన సుమారు 300 మంది వైఎస్సార్ సీపీలో చేరారు. ఈ సందర్భంగా మంత్రి చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాలకృష్ణ మాట్లాడుతూ త్వరలో జరగనున్న ఎన్నికల్లో పార్టీని అధికారంలోకి తీసుకురావాలని పిలుపునిచ్చారు. పార్టీలో చేరిన ప్రతి ఒక్కరికి పార్టీ అండగా ఉంటుందన్నారు. సీఎం వైఎస్ జగన్ అందిస్తున్న సంక్షేమం, అభివృద్ధి కొనసాగాలన్న ,ఇంటి వద్దకే సంక్షేమ ఫలాలు చేరాలన్నా మళ్లీ జగనే ముఖ్యమంత్రి కావాలన్నారు. కార్యక్రమంలో మాజీ డిప్యూటీ మేయర్ బాక్సు ప్రసాద్, మాజీ కార్పొరేటర్ మెరపల శ్యామలరావు, వైఎస్సార్ సీపీ నాయకులు తలారి వరప్రసాద్, బొడ్డేటి శివాజీ తదితరులు పాల్గొన్నారు.

భరత్ అనే నేను.. మాట ఇస్తున్నా..



ప్రచారంలో పాల్గొన్న ఎంపీ మార్గాని భరత్‌రామ్



నగరంలో ప్రచారం చేస్తున్న రాజమహేంద్రవరం పార్లమెంట్ అభ్యర్థి డాక్టర్ గూడూరి శ్రీనివాస్, మార్గాని భరత్‌రామ్ సతీమణి మార్గాని మోనా

- సంఘ విద్రోహక శక్తులను ఉక్కుపాదంతో తొక్కేస్తా
- నగర ప్రజలకు నిరంతర మంచినీటి సౌకర్యం
- నగరంలో 10 వేల మంది నిరుద్యోగులకు ఉపాధి అవకాశాలు
- ఎన్నికల ప్రచారంలో ఎంపీ భరత్ రామ్

రాజమహేంద్రవరం సిటీ: నగరంలో ప్రజలను ఆందోళనకు గురిచేస్తున్న బ్లేడ్ బ్యాచ్, గంజాయి బ్యాచ్, రౌడీ షీటర్లు తదితర సంఘ విద్రోహక శక్తుల ఆట కట్టిస్తానని ఎంపీ, వైఎస్సార్ సీపీ సిటీ ఎమ్మెల్యే అభ్యర్థి మార్గాని భరత్ రామ్ అన్నారు. సోమవారం నగరంలోని 37, 42 డివిజన్లలో ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీ భరత్ రామ్ టాప్ టెన్ భరత్ ప్రామిసెస్ పేరుతో తయారు చేసిన మేనిఫెస్టోను వివరించారు. నగరంలో కొంతమంది ప్రతిపక్ష నాయకుల అండదండలతో పెట్రేగిపోతున్న రౌడీ షీటర్స్, బ్లేడ్ బ్యాచ్, గంజాయి బ్యాచ్‌లను నగర బహిష్కరణ చేస్తానన్నారు. నగరంలోని నిరుద్యోగ యువత 10 వేల మందికి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పిస్తానని, స్పోర్ట్స్ హబ్‌గా నగరాన్ని తీర్చిదిద్దుతానని మాటిచ్చారు. ఉమెన్ ఎంపవర్మెంట్, జగనన్న కాలనీల ద్వారా 40 వేలమందికి ఇళ్ల నిర్మాణం, ఇంకా ఎవరికైనా నిరుపేద అర్హులై ఇళ్ల స్థలాలు అందకుంటే వారికీ అందజేస్తానని ఎంపీ మాటిచ్చారు. నగరంలో 24 గంటలూ నిరంతరాయంగా మంచినీటి సరఫరా చేసేలా బృహత్తర ప్రణాళికను అమలు చేయడం, తన డ్రీమ్ ప్రాజెక్టు గోదావరి బండ్ రోడ్డు (రివర్ సిటీ) అభివృద్ధి, రెండు మూడు సాఫ్ట్‌వేర్ కంపెనీలు తీసుకొచ్చి నగరంలో అర్హులైన యువతకు సాఫ్ట్‌వేర్ ఉద్యోగావకాశాలు కల్పిస్తానన్నారు. ఇన్క్యుబేషన్, స్టార్టప్స్, నగర పరిధిలో లాలా చెరువు, బొమ్మూరు, పిడింగొయ్యి, వేమగిరి జంక్షన్ల వద్ద నాలుగు ఫ్లై ఓవర్ బ్రిడ్జిలు నిర్మించే బాధ్యత తనదని అన్నారు. మోరంపూడి జంక్షన్ వద్ద ఫ్లై ఓవర్ బ్రిడ్జి నిర్మాణ పనులను ఎంత ప్రతిష్టాత్మకంగా తీసుకున్నానో అంతే రీతిలో ఈ ఫ్లై ఓవర్ వంతెనల విషయంలో తీసుకుంటానన్నారు. ఎంపీగా నగరంలో నేను చేసిన అభివృద్ధిని చూడండి నచ్చితే నన్ను ఆశీర్వదించమని ప్రజలను అభ్యర్థించారు. పేదలకు సంక్షేమ పథకాల సక్రమంగా అందాలన్నా, రాష్ట్రం అన్ని రకాలుగా అభివృద్ధి చెందాలన్నా అది ఒక్క జగన్‌మోహన్‌రెడ్డి వల్లనే సాధ్యమని, టీడీపీ చంద్రబాబుకు ఓటేస్తే అవినీతికి మద్దతిచ్చినట్లేనని అన్నారు. ఈ కార్యక్రమాలలో పార్టీ నాయకులు బాలాజీరెడ్డి, టీకే విశ్వేశ్వరరెడ్డి, నామన వాసు, సబ్బారపు సూరిబాబు, సుందర సింగ్, నక్కా శ్రీనగేష్ తదితరులు పాల్గొన్నారు.

జోరుగా డాక్టర్ గూడూరి శ్రీనివాస్ ప్రచారం

రాజమహేంద్రవరం పార్లమెంట్ అభ్యర్థి డాక్టర్ శ్రీనివాస్ జోరుగా ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నారు. సోమవారం నగరంలో 14, 15, 25 డివిజన్‌లలో ఎంపీ భరత్‌రామ్ సతీమణి, మార్గాని మోనాతో కలసి విస్తృతంగా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ గూడూరి శ్రీనివాస్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి అధికారంలోకి వచ్చిన తర్వాత రాష్ట్రంలో జరిగిన సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు సంపూర్ణంగా అమలు చేశారన్నారు. భవిష్యత్‌లో ఇదే అభివృద్ధి కొనసాగాలంటే వివరిస్తూ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎన్నికల ప్రచారంలో 25వ డివిజన్ ఇన్‌చార్జి ఆడపా రఘు, మాజీ కార్పొరేటర్ నీలపాల తమ్మారావు, రాష్ట్ర ఇండస్ట్రీస్ డెవలప్మెంట్ కార్పొరేషన్ స్టేట్ డైరెక్టర్ కానుబోయిన సాగర్, రాష్ట్ర లిడ్ క్యాప్ డైరెక్టర్ తగరం సురేష్ బాబు, నీలం గణపతి తదితరులు పాల్గొన్నారు.

జగనన్నతోనే జనరంజక పాలన

బొమ్మూరులో ఎన్నికల ప్రచారంలో గొందేశి శ్రీనివాసులురెడ్డి



వైఎస్సార్ సీపీలో చేరిన వారితో వైఎస్సార్ సీపీ నేత శ్రీనివాసులురెడ్డి

రాజమహేంద్రవరం రూరల్: వైఎస్సార్ సీపీతోనే సంక్షేమ పథకాల అమలు సాధ్యమవుతుందని పార్టీ సీనియర్ నేత, ప్రముఖ న్యాయవాది గొందేశి శ్రీనివాసులురెడ్డి అన్నారు. సోమవారం సాయంత్రం ఆయన ఆధ్వర్యంలో బొమ్మూరులోని సోమనవారితోట తదితర ప్రాంతాల్లో ఫ్యాన్ గుర్తుకు ఓటు వేసి వైఎస్సార్ సీపీ రూరల్ ఎమ్మెల్యే అభ్యర్థి, మంత్రి చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణ, ఎంపీ అభ్యర్థి డాక్టర్ గూడూరి శ్రీనివాస్‌లను గెలిపించాలని కోరుతూ ఇంటింటికీ వెళ్లి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా గొందేశి శ్రీనివాసులరెడ్డి మాట్లాడుతూ సీఎం జగన్‌పాలనలో ప్రతి కుటుంబానికి మేలు జరిగిందన్నారు. రాబోవు ఎన్నికలలో మరోసారి జగన్‌మోహన్‌రెడ్డిని ముఖ్యమంత్రిని చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక నేతలు దాకేశ్రీనివాస్, సోమన శ్రీనివాస్, తోడేటి రాజా, సోమన వెంకటేశ్వరరావు, వైఎస్ కుమార్, తోడేటి రాహుల్, జాలా కృపారావు, అప్పారాజీవ్ కుమార్, ఆనం శ్రీను, షేక్‌హసీనా, కేతానాగేశ్వర్, అన్నపూడి ప్రకాష్, పిల్లిచంద్రరావు, పార్టీనాయకులు ముద్దాల అను, యెనుముల త్యాగరాజు, నాగులపల్లి ఆశ, సద్గుణరామారెడ్డి, కె.వి.సుబ్బారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీలో 100 మంది చేరిక

రాజమహేంద్రవరం రూరల్: బొమ్మూరు ఝాన్సీ లక్ష్మీబాయి నగర్‌కు చెందిన టీడీపీ, జనసేనల నుంచి సుమారు 100 మంది సోమవారం రాత్రి వైఎస్సార్ సీపీ సీనియర్ నేత గొందేశి శ్రీనివాసుల రెడ్డి ఆధ్వర్యంలో మేడపాటి సద్గుణ రామారెడ్డి నేతృత్వంలో వైఎస్సార్ సీపీలో చేరారు. స్థానిక బాలాజీపేట గొందేశి మేన్షన్‌లో కార్యాలయంలో పార్టీలో చేరిన మహిళలు, యువతకు శ్రీనివాసుల రెడ్డి పార్టీ కండువాలు వేసి సాదరంగా ఆహ్వానించారు. పార్టీలో చేరిన ప్రతిఒక్కరు రాబోవు ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణ, ఎంపీ అభ్యర్థి గూడూరి శ్రీనివాస్‌ల విజయానికి కృషి చేయాలని ఆయన పిలుపునిచ్చారు. గొర్రెల లక్ష్మి, పిల్ల పార్వతి , సందక సత్య వతి, అనసూరి సరళ , బదిరెడ్డి శ్రీధర్,తాళ్ల సత్యనందం తాళ్ల మోహన్‌కృష్ణ, గుంపెనా నాగేశ్వరరావు ,పిసిని ఆరుద్ర, ఐశ్వరపు దుర్గ. కెల్లా బలరాం, కుంకునూరి కృష్ణ, కొంపేర్ల దుర్గ భవాని , మాడెం సత్యవతి ,నరాలశెట్టి సీతా రామయ్య, మజ్జి ఈశ్వరి,కొంచాడ సూర్యావతి, దువ్వు లక్ష్మి ,దువ్వు వరలక్ష్మి, కడలి కుమారి తదితరులు పార్టీలో చేరారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు మరడాపు శేఖర్, సూరంపూడి ప్రకాష్, రెడ్డిప్రసాద్, చరణ్, కైఫ్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు అభినందనలు

ఐసీఎస్ఈ టెన్త్, ఐఎస్‌సీ ఇంటర్‌లో ఫ్యూచర్‌కిడ్స్ నూరుశాతం ఉత్తీర్ణత



చరణ్‌సింహారెడ్డి, ఐసీఎస్‌సీ పదో తరగతి



కుష్వంత్‌రెడ్డి ఐఎస్‌సీ 12వ తరగతి



జయేష్‌రాయుడు ఐఎస్‌సీ 12వ తరగతి

రాజమహేంద్రవరం రూరల్: స్థానిక ది ఫ్యూచర్ కిడ్స్ విద్యార్థులు సోమవారం విడుదలైన ఐసీఎస్ఈ పదో తరగతి, ఐఎస్‌సీ 12వ తరగతి పరీక్షా ఫలితాల్లో నూటికి నూరు శాతం ఉత్తీర్ణత సాధించారని పాఠశాల డైరెక్టర్ రవిబాబు యేలేటి ఒక ప్రకటనలో తెలిపారు. ఐసీఎస్ఈ పదో తరగతి పరీక్షా ఫలితాలలో కె.చరణ్‌సింహారెడ్డి 99 శాతం మార్కులతో ప్రథమ స్థానం, వీరేన్‌చౌహాన్, రుచిత్ సాయి, కృష్ణకౌశిక్ 98 శాతం మార్కులతో ద్వితీయ స్థానం, శ్రీకుషాల్, భరద్వాజ్, లాస్య కరుటూరి 97శాతం మార్కులతో తృతీయ స్థానం కై వసం చేసుకున్నారు. ఐఎస్‌సీ 12వ తరగతి పరీక్షా ఫలితాలలో కుష్వంత్‌రెడ్డి 97 శాతం మార్కులతో ప్రథమ స్థానం, జయేష్ రాయుడు 96 శాతం మార్కులతో ద్వితీయ స్థానం, ప్రశాంత్ 95 శాతం మార్కులతో తృతీయ స్థానం, తారక్ అభిరామ్ 94 శాతం మార్కులతో నాలుగో స్థానం, శ్రీనివాస్ వినయ్ 93 శాతం మార్కులతో ఐదో స్థానాన్ని కైవసం చేసుకున్నారు. ఈ పరీక్షల ఫలితాలలో అద్భుతమైన ప్రతిభను కనబరిచిన విజేతలను, ఉపాధ్యాయ బృందాన్ని పాఠశాల డైరెక్టర్ రవిబాబు యేలేటి, చైర్‌పర్సన్ విజయ యేలేటి, సీఈవో శ్రీరుద్ర శ్రీమహిత్వ యేలేటి, డీన్ హర్షిణి, ప్రిన్సిపాల్ శేషగిరిధర్, వైస్ ప్రిన్సిపాల్స్ సైదాబాను, శ్రీవల్లి అభినందించారు.

వేంద్ర, పెద్దాడ గ్రామాల్లో పోలీసుల కవాతు

పెదపూడి: మండలంలోని వేంద్ర, పెద్దాడ గ్రామాల్లో స్థానిక ఎస్‌ఐ శోభన్‌కుమార్ ఆధ్వర్యంలో సోమవారం కేంద్ర పోలీసు బలగాల కవాతు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్‌ఐ శోభన్‌కుమార్ మాట్లాడుతూ ఈ నెల 13న జరిగే సార్వత్రిక ఎన్నికలు ప్రశాంత వాతవరణంలో సజావుగా నిర్వహించడానికి వివిధ పార్టీల నాయకులు, ప్రజలు సహకరించాలన్నారు. ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున దానికి అనుగుణంగా అందరు పని చేయాలని కోరారు. ఓటు హక్కును స్వేచ్ఛగా వినియోగించుకోవచ్చని ఓటర్లలో ధైర్యాన్ని నింపడం కోసం ఈ కవాతు చేస్తున్నామన్నారు. ప్రతిఒక్కరూ ఓటు వేసి సమాజానికి మంచి చేయాలన్నారు. అందరూ నిబంధనలు ఉల్లంఘించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.